# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విజ్ఞానం సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ రోజ్‌గార్ మేళా 17వ విడత కింద 51 వేలకు పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు పంపిణీ చేయనున్నారు.
- ❖ ఆపరేషన్ సిందూర్ భారతదేశపు సంకల్ప శక్తిని, నావికా దళ సామర్థ్యాన్ని ప్రదర్శించిందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

==================

జ్ఞానం సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 21వ శతాబ్దాన్ని జ్ఞాన శతాబ్దంగా ఆమె అభివర్ణించారు. కేరళలో పర్యటిస్తున్న రాష్ట్రపతి పాలాలో ఉన్న సెయింట్ థామస్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, అక్షరాస్యతల శక్తి కేరళను అనేక మానవ అభివృద్ధి సూచికల్లో అగ్రగామిగా నిలిపిందని అన్నారు. విద్య అనేది నూతన అవకాశాలను అన్వేషించేందుకు దోహదపడుతుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అంతకుముందు కేరళలోని వర్కలాలో ఉన్న శివగిరి మఠంలో నారాయణ గురు మహాసమాధి శతాబ్ది కార్యక్రమాన్ని రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ.. నారాయణ గురు భారతదేశంలో గొప్ప సంఘ సంస్కర్తల్లో ఒకరని అన్నారు. అజ్ఞానం, అంధవిశ్వాసాల బారి నుంచి ప్రజలను రక్షించడానికి ఆయన జీవితాన్ని అంకితం చేశారనీ, 19వ శతాబ్దంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవన సమయంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రపతి కొనియాడారు.

==================

రోజ్‌గార్ మేళా 17వ విడత కింద 51 వేలకు పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పంపిణీ చేయనున్నారు. దేశ వ్యాప్తంగా మొత్తం 40 ప్రదేశాల్లో జరిగే ఈ నియామక పత్రాల పంపిణీలో తమిళనాడులో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ పాల్గొంటారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ మధురైలోనూ, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తిరుచిరాపల్లిలో అభ్యర్థులకు నియామక లేఖలను పంపిణీ చేస్తారు.

==================

గగన్‌యాన్ అన్‌క్రూడ్ టెస్ట్ ఫ్లైట్ మిషన్ G1 కి సంబంధించిన పనులు 90 శాతం పూర్తయ్యాయని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలియజేశారు. వీటిపై ప్రస్తుతం అంతర్గత పరీక్షలు, సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలిస్తున్నామని చెప్పారు. బెంగళూరులో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ 2025 (ESTIC-2025) కర్టన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎస్కేప్ సిస్టమ్, పారాచూట్ మాడ్యూల్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ మరియు ఇతర సబ్ సిస్టమ్‌లతో కూడిన క్రూ మాడ్యూల్‌పై పరీక్షలు విజయవంతమయ్యాయని తెలిపారు. గగన్యాన్ ప్రాజెక్ట్ ప్రస్తుతం చివరి దశకు వచ్చిందని, దీని కంటే ముందుగా మూడు మానవ రహిత మిషన్లు చేపడతామని నారాయణన్ వెల్లడిస్తూ..

(వాయిస్ 22 సెకన్లు)

==================

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ కూటమి తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా రాష్ట్రీయ జనతాదళ్ (RJD) పార్టీ నాయకుడు తేజస్వి ప్రసాద్ యాదవ్‌ను ప్రకటించింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడు అశోక్ గెహ్లాట్ పాట్నాలో ఈరోజు జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. మహాఘట్‌బంధన్ కూటమిలోని ఏడు భాగస్వామ్య పార్టీల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ ప్రధాన నాయకుడు ముఖేష్ సహానీని ఉప ముఖ్యమంత్రిగా నియమిస్తామని అశోక్ గెహ్లాట్ చెప్పారు.

విరామం

==================

ఆపరేషన్ సిందూర్ భారతదేశపు సంకల్ప శక్తిని, నావికా దళ సామర్థ్యాన్ని ప్రదర్శించిందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారతదేశం ఏ సవాలుకైనా ప్రతిస్పందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని ప్రపంచానికి సందేశం ఇచ్చిందని అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన నేవల్ కమాండర్ల సమావేశంలో ప్రసంగించిన రక్షణ మంత్రి, పాకిస్తాన్‌ను దాని హద్దుల్లో నిలువరించిన భారత నావికాదళాన్ని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో నావికాదళం యొక్క కార్యాచరణ సంసిద్ధత, వృత్తిపరమైన సామర్థ్యం, బలాన్ని ప్రపంచం చూసిందన్నారు.

==================

కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లోని వార్ రూమ్ నుండి పండుగ సీజన్‌లో నడిచే ప్రత్యేక రైళ్లపై సమీక్ష చేపట్టారు. ఛట్ పూజ నేపథ్యంలో ఈరోజు ఆయన అధికారులతో సంభాషించారు. రైల్వే సన్నాహాలను పరిశీలించారు. దేశవ్యాప్తంగా మొత్తం మూడు స్థాయిలలో వార్ రూమ్స్ ఉన్నాయని, వాటిలో డివిజన్ స్థాయిలో ఒకటి, జోనల్ స్థాయిలో ఒకటి, రైల్వే బోర్డు స్థాయిలో ఒకటి ఏర్పాట్లను కలిగి ఉన్నాయని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొననున్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్ లో సంభాషించానని ఆసియాన్ అధ్యక్షుడిగా మలేషియా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలిపానని నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. రాబోయే శిఖరాగ్ర సమావేశాలు విజయవంతం కావాలని ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆసియాన్-భారతదేశం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకునేందుకు తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. 47వ ఆసియాన్ శిఖరాగ్ర సమావేశం ఇతర సమావేశాలతో పాటు ఈ నెల 26 నుండి 28 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనుంది.

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

==================

బ్యాంకింగ్ నియమాల (సవరణ) చట్టం-2025 కింద నామినేషన్‌కు సంబంధించి కీలక నిబంధనలు  నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ చట్టాన్ని గెజిట్ నోటిఫికేషన్ ద్వారా 2025 ఏప్రిల్ 15న అధికారికంగా ప్రకటించారు. ఇందులో 5 చట్టాల్లో కలిపి మొత్తం 19 సవరణలు తీసుకువచ్చారు. ఈ నూతన నిబంధనల ప్రకారం వినియోగదారులు ఒకేసారి లేదా వరస క్రమంలో నలుగురు వ్యక్తులను నామినేట్ చేయవచ్చు. దీంతో డిపాజిటర్లు, వారి నామినీలకు క్లెయిముల పరిష్కారం సులభతరమవుతుంది. నిర్వహణ ప్రమాణాల బలోపేతం, డిపాజిటర్లు- ఇన్వెస్టర్లకు రక్షణను మెరుగుపరచడం, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఆడిట్ నాణ్యతను మెరుగుపరచడమే ఈ బ్యాంకింగ్ నియమాల (సవరణ) చట్టం ప్రధాన లక్ష్యం.

==================

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. డయ్యూ డామన్, నికోబార్ దీవులు, కేరళ, మాహే, కొంకణ్, గోవాలలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరిలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉంటాయని వెల్లడించింది. లక్షద్వీప్, మధ్యప్రదేశ్, ఒడిశా తెలంగాణలలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని IMD అంచనా వేసింది.

==================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 426 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 130 పాయింట్ల లాభంతో 84 వేల 556 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 23 పాయింట్ల లాభంతో 25 వేల 891 వద్ద ముగిసింది.

==================
==================